క్లుప్తంగా

హద్దురాళ్లు ఏర్పాటు చేయండి


మాట్లాడుతున్న ఆర్డీఓ

గూడూరురూరల్‌:జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా భూముల రీసర్వే జరిగిన గ్రామాల్లో హద్దురాళ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్‌ ఆదేశించారు. సోమవారం గూడూరులోని సబ్‌కలెక్టర్‌ కార్యాలయంలో గూడూరు, వెంకటగిరి మున్సిపాలిటీలకు సంబంధించిన టౌన్‌ప్లానింగ్‌ కార్యదర్శులు, సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా హద్దురాళ్ల ఏర్పాటు పనులకు గూడూరు, వెంకటగిరి మండలాల్లో విలేజ్‌ సర్వేయర్ల కొరత ఉందన్నారు.

ప్రజల్లో మార్పు తేవాలి


సదస్సులో మాట్లాడుతున్న కట్టా సుధాకర్‌రెడ్డి

నాయుడుపేటటౌన్‌:గ్రామాలతోపాటు పట్టణాల్లో పారిశుద్ధ్యంపై ప్రజల్లో మార్పు తెచ్చేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌ రెడ్డి అన్నారు. మేనకూరులోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం వద్ద పలు జిల్లాలకు చెందిన ఎంపీడీఓలకు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, ప్రసంగించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కే జ్యోతిరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ ఎం ఇందిర, మేనకూరు సర్పంచ్‌ సురేష్‌, ఈఓపీఆర్డీ వెంకట్రావ్‌, గూడూరు డీఎల్‌డీఓ వాణిరెడ్డి, శ్రీకాళహస్తి ఈటీసీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్‌ సమతారెడ్డి, వైస్‌ ప్రిన్సిపల్‌ విద్యారమ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌ మేళా రేపు

గూడూరురూరల్‌: పట్టణంలోని ఎస్‌కేఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు ఐసీఐసీఐ బ్యాంకు ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్‌ పి.వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ చదివి, 25 ఏళ్లలోపు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్‌ సర్టిఫికెట్లు, జెరాక్స్‌ కాపీలు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని ఆయన సూచించారు. వివరాలకు 7842648484 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

గూడూరురూరల్‌: స్పందన కార్యక్రమంలో వచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆర్డీఓ ఎం.కిరణ్‌కుమార్‌ తెలిపారు. గూడూరులోని సబ్‌కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం, వల్లిపేడు గ్రామాలకు చెందిన ప్రజలు గతంలో సీజేఎఫ్‌ఎస్‌ భూములు సాగుచేసుకుంటున్నామని, తమకు అనుభవ హక్కులు కల్పించాలని కోరారు. వాకాడు, గూడూరు మండలాల్లోని పలు గ్రామాల్లో దారి సమస్యలు పరిష్కరించాలని బాధితులు అర్జీలను అందజేశారు.

ఓటరు నమోదు చేయించాలి

పెళ్లకూరు: వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటరు నమోదు చేయించాలని తహసీల్దార్‌ రామయ్య పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన బీఎల్వో సమావేశంలో ఆయన మాట్లాడారు. వివాహమై వెళ్లిపోయిన వారు, మృతి చెందిన వారిని గుర్తించి ఓటరు జాబితా నుంచి వారి పేర్లు తొలగించాలన్నారు. ఏఎస్‌ఓ మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

రూ.30 లక్షల నిధులు మంజూరు


నిధుల మంజూరు పత్రాలను
జెడ్పీ చైర్‌పర్సన్‌ అరుణమ్మ

చిల్లకూరు: మండలంలోని కలవకొండలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి సోమవారం జెడ్పీ నిధులు రూ.30 లక్షలు విడుదల చేస్తూ జెడ్పీ చైర్‌పర్సన్‌ ఆనం అరుణమ్మ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. నిధుల మంజూరు పత్రాలను చిల్లకూరు జెడ్పీటీసీ సభ్యుడు ఎం శీనయ్యకు అందజేశారు. కలవకొండలో కొన్నేళ్లుగా తాగునీరు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్‌, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌ల ద్వారా జెడ్పీ సమావేశాల్లో సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో జెడ్పీ నిధుల నుంచి రూ.30 లక్షల నిధులు మంజూరు చేసి, అందుకు సంబంధించిన మంజూరు పత్రాలను నెల్లూరు జిల్లా పరిషత్‌ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు శీనయ్య, తొణుకుమాల ఎంపీటీసీ సభ్యుడు ఎల్లసిరి జానకిరామ్‌, ఉడతా శ్రీనివాసులు చేతికి అందజేశారు. కలకొండ సర్పంచ్‌ ఉడతా సుభాషిణి జెడ్పీ చైర్‌పర్సన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆక్రమణల అచ్చెరువు


చెరువును చదును చేసి గట్లు వేసిన ఆక్రమణదారులు

చెరువు జీవకోటికి జీవగర్ర.. దాన్ని కర్షకులు నీటివనరుగా వినియోగించుకోవాలి..అయితే ఉపయోగించుకోవాల్సిన వారే ఆక్రమణలకు పాల్పడడంతో వాటికి రక్షణ కరువు అవుతోంది. ఫలితంగా చెరువులో నీటి నిల్వలు లేకుండాపోయి, అక్కరకు పనికిరాకుండాపోతోంది.

- ఆక్రమణలలో బాపన చెరువు
- 20 ఎకరాల మేర కబ్జా చేసిన రైతులు
- నిమ్మకు నీరెత్తిన చందంగా అధికారులు

చిల్లకూరు: రైతులకు సాగునీరు అందించే చెరువులపై అధికారులకు పూర్తిస్థాయి అజమాయిషీ లేకుండాపోయింది. దీంతో చెరువు ఎగువప్రాంతంలోని కొంతమంది కర్షకులు ఇష్టానుసారంగా చెరువులో ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే బల్లవోలు పంచాయతీలోని బాపన చెరువును కొంత మంది రైతులు సుమారు 20 ఎకరాల మేరకు ఆక్రమించుకుని గట్లు వేశారు. అధికారులు పట్టించుకోకపోతే మరింత ఆక్రమణలకు గురవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ సోమవారం తహసీల్దార్‌ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. బల్లవోలు పంచాయతీలోని బాపనచెరువు సుమారు 51 ఎకరాల విస్తీర్ణం ఉంది. దీని కింద 30 ఎకరాల ఆయకట్టు ఉంది. అలాగే బల్లవోలు డ్రైన్‌ నుంచి వచ్చే వరద నీటిని చెరువులోకి తీసుకుని వచ్చి, అనధికారికంగా మరో 25 ఎకరాల వరకు రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇటీవల చెరువు ఎగువ ప్రాంతంలోని రైతులు కొందరు రాత్రికి రాత్రే చెరువును చదును చేసి, గట్లు వేసుకుని సుమారు 20 ఎకరాల వరకు ఆక్రమించి, సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఇలా ఆక్రమించుకుంటూ పోతే దిగువన ఉన్న రైతులకు సాగునీరు అందక అవస్థ పడాల్సి వస్తుందని ఆయకట్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంయుక్తంగా సర్వే చేస్తాం

బాపన చెరువు ఆక్రమణలకు గురవుతున్న విషయమై స్థానికులు మాకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి, ఆక్రమణలను తొలగించడంతో పాటుగా చెరువు చుట్టూ ఆక్రమణలు జరగకుండా ట్రెంచ్‌ ఏర్పాటు చేస్తాం.

–కృష్ణయ్య, ఇరిగేషన్‌ ఏఈ, చిల్లకూరు

ఆక్రమణలు తొలగించాలి



బాపన చెరువులో ఆక్రమణలను తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టాలి. చెరువు లోతట్టు సుమారు 20 ఎకరాల వరకు కొంతమంది ఆక్రమించి గట్లు వేసుకుని సాగుకు సిద్ధం అవుతున్నారు. వర్షాలు ప్రారంభం అయిన తరువాత ఆక్రమణలతో సాగు నీరు చెరువుకు తక్కువగా చేరుతుంది. దీంతో ఆయకట్టు కింద సాగు చేసే మాకు సాగు నీరందడం కష్టం అవుతుంది.

–ఉప్పల రవి, ఆయకట్టు రైతు, కోరావారిపాళెం

అడ్డుకోవాలని ఆదేశాలిచ్చాం



బాపన చెరువు ఆక్రమణలకు గురవుతుందన్న సమాచారం అందించిన వెంటనే వీఆర్వో శ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలను అడ్డుకోవాలని ఆదేశాలు జారీ చేశాం. ఆక్రమణలదారులకు నోటీసులిచ్చి వారి వద్ద నుంచి లిఖిత పూర్వకంగా తీసుకోవాలని సూచించాం.

– కె శ్రీనివాసులు, తహసీల్దార్‌, చిల్లకూరు

అందరి బంధువులయ్యా..

వలంటీర్లకు వందనం


చిల్లకూరు: వల్లిపేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోవిడ్‌ పరీక్షలు చేయిస్తున్న వలంటీర్లు

చిల్లకూరు: ప్రభుత్వం నియమించిన వలంటీర్లు వారు గ్రామాల్లో నివసించే వారికి బంధువుల్లా వ్యవహరిస్తూ, వారికి అండగా ఉంటున్నారు. గ్రామంలో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులతో కూడా కలసి మెలసి ఉంటూ ఒకరికొకరు సమష్టిగా సేవలు అందిస్తున్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో పాల్గొని, కీలక పాత్ర పోషించారు. మండలంలోని వల్లిపేడు పాఠశాలలో విద్యార్థులిద్దరికి కరోనా పాజిటివ్‌ నిర్ధారణ కావడంతో వెంటనే స్పందించిన వలంటీర్‌, మురళి, రమేష్‌లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులందరికీ వైద్యసిబ్బందిని అభ్యర్థించి, కరోనా పరీక్షలు చేయించడంలో కీలకంగా వ్యవహరించారు. అప్పట్లో వారు చేసిన సేవలను పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు నేటికీ కొనియాడుతున్నారు. అలాగే గ్రామంలో కూడా కోవిడ్‌ నివారణకు అవసరమైన ప్రతి పనిని తమదిగా భావించి చేశారు.

పిలిచిన వెంటనే వస్తారు



గ్రామంలో వలంటీర్లు ఎవరినైనా పాఠశాలలో పని ఉంది సహకారం అందించాలని కోరడమే తరువాయి వెంటనే వారు వచ్చి, చెప్పిన పనిని సేవగా భావించి చేసేవారు. కోవిడ్‌ సమయంలో ఇద్దరు విద్యార్థులకు కోవిడ్‌ పాజిటివ్‌ అని తెలిసిన వెంటనే పాఠశాలలో అందరికీ కరోనా పరీక్షలు చేయించి, పాఠశాలలో హైపోక్లోరైట్‌ పిచికారీతోపాటు బ్లీచింగ్‌ చల్లించారు. వారి సేవలు మరువలేనివి.

–విజయ, పీఈటీ, జెడ్పీ హైస్కూలు, వల్లివేడు

ఘనంగా పొంగళ్లు

సైదాపురం: మండలంలోని పొలూరు రాజుపాళెంలో పొంగళ్లు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని సీతారాముల వారి దేవస్థానం నూతనంగా నిర్మించారు. ఆలయంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా సోమవారం వేదపండితులు ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో పొంగళ్లు పెట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు.

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం


వేణుంబాకంలో వర్షంలో తడుస్తూనే బుక్‌లెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

దొరవారిసత్రం: రాష్ట్రాభివృద్ధి నుంచి ప్రతి కుటుంబ అభ్యున్నతి వరకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం తుంగమడుగు, వెదురుపట్టు, వెదురుపట్టురాజుపాళెం, వేణుంబాకం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను గురించి వివరించి బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. అలాగే ప్రజల నుంచి ఎదురైన ప్రతి సమస్యను విని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చెంగాళ్లమ్మ దేవస్థానం చైర్మన్‌ డీ బాలచంద్రారెడ్డి, మండల కన్వీనర్‌ ఈ శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రమేష్‌, సర్పంచ్‌ మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునస్వామినాయుడు, సురేష్‌రెడ్డి, బాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఓవైపు వర్షంలోనూ గడప గడపకు...

ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికీ లెక్క చేయకుండా స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, నాయకులు వర్షంలో తడుస్తూనే వేణుంబాకం గ్రామం, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబాల సభ్యులకు బుక్‌లెట్‌ను అందజేశారు. మళ్లీ ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు.

మళ్లీ జగనన్నే సీఎం


వాకాడు: మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డే అవుతారని వైఎస్సార్‌ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి జోస్యం చెప్పారు. రాపూరు తెలుగుగంగ అతిథి గృహంలో సోమవారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఇటీవల వెంకటగిరిలో జరిగిన నేతన్న నేస్తం కార్యక్రమానికి తరలి వచ్చిన ప్రజానీకమే ఇందుకు సాక్ష్యమన్నారు. పెంచలకోన క్షేత్రానికి మాస్టర్‌ప్లాన్‌ తయారు చేస్తున్నామని, కోన అభివృద్ధి చెందితే యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందిస్తున్నామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం గుండవోలులో సోమవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌తో కలసి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.పట్టాభిరామిరెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకులు పీ మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్‌ కన్వీనర్‌ డీ నారాయణరెడ్డి, ఎంపీపీ ప్రసన్న, వైస్‌ ఎంపీపీ పెంచలరెడ్డి, నాయకులు వెంకటరమణారెడ్డి, నరసింహారెడ్డి, శశిరెడ్డి, విశ్వనాథరెడ్డి, సంజీవరెడ్డి, రాజు పాల్గొన్నారు.


రాపూరు: గుండవోలులో లబ్ధిదారుకు బుక్‌లెట్‌ అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

జగనన్నపై ఉన్న నమ్మకమే

వాకాడు: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజల్లో ఉన్న నమ్మకమే మొన్న వెంకటగిరిలో జరిగిన బహిరంగ సభ జనసంద్రంగా మారిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన వాకాడులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. జగనన్నపై ఉన్న నమ్మకం, అభిమానంతో వెంకటగిరి సభకు జనం అంచనాలకు మించి తరలిరావడంతో ప్రతి పక్షాల నోట మాట లేకుండాపోయిందన్నారు. అనంతరం వాకాడు డిపో ఉద్యోగులు రామ్‌కుమార్‌రెడ్డిని కలసి డిపోలో బస్సులు ఒక్కొక్కటిగా తొలగిస్తున్నారంటూ వినతి పత్రం సమర్పించారు.

జాతర నిర్వహణపై వివాదం

తడ: మండలంలోని కారూరులో మంగళవారం జరగనున్న అమ్మవారి జాతర విషయమై గ్రామంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. వివరాలల్లోకి వెళితే.. కారూరు గ్రామంలో అమ్మవారి జాతర పెద్ద ఎత్తున నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే టీడీపీ వర్గీయులు ఈ విషయాన్ని వివాదాస్పదం చేసి జాతర నిలిపే ప్రయత్నం చేశారు. దీంతో అధిక సంఖ్యలో గ్రామస్తులు వారిని అడ్డుకుని జాతర నిర్వహణకు మొగ్గు చూపారు. స్థానికంగా ఫలితం లేకపోవడంతో టీడీపీ వర్గీయులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, నాయుడుపేట డీఎస్పీ రాజాగోపాల్‌రెడ్డి స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో ఇరువర్గాలతో శాంతి సమావేశం నిర్వహించారు. అయినప్పటికీ జాతర వాయిదాకే టీడీపీ నాయకులు పట్టుబట్టడంతో అధికారులు సమావేశం వాయిదా వేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్‌ జేజేరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మండలంలోని అచ్చుకట్ల గ్రామానికి చెందిన వేనాటి చంద్రారెడ్డి, వేనాటి ఇంద్రసేనారెడ్డి సోదరులు రూ. లక్ష నగదు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని సోమవారం ఆలయ సిబ్బందికి అందజేశారు.

భూ వివాదాల పరిష్కారానికే రీసర్వే

ఓజిలి: భూ వివాదాలను పరిష్కరించేందు ప్రభుత్వం రీసర్వేను చేపట్టిందని తహసీల్దార్‌ శివరామసుబ్బయ్య అన్నారు. మండలంలోని కారూరులో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ మధుసూదన్‌రావు, సర్వేయర్‌ గోపిరెడ్డి, వీఆర్వో కస్తూరయ్య పాల్గొన్నారు.

మణిపూర్‌ ఘటన అమానుషం

వెంకటగిరి: మణిపూర్‌లో కుకీ ఆదివాసీ మహిళలపై జరిగిన వికృతదాడి అమానుష చర్య అని స్త్రీవిముక్తి ఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె అజిత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ ఘటనలో మహిళలపై దౌర్జన్యకాండకు కారకులైన నిందితులందరినీ తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

పొదుపు మహిళలకు శిక్షణ


మాట్లాడుతున్న ఏపీఎం రాధ

సైదాపురం: మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఏపీఎం రాధ, జిల్లా ట్రైనర్‌ చిన్నయ్య ఆధ్వర్యంలో పొదుపు సంఘాల అధ్యక్షులు, వీఓఏలకు ఆర్థిక స్థితిగతులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎం రాధ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు ఈశిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు లోకోస్‌ యాప్‌లో సభ్యుల ప్రొఫైల్‌ ఎలా నమోదు చేయాలన్న విషయమై శిక్షణ ఇచ్చామన్నారు.

ఘనంగా పీర్లపండుగ


పులివేషాలతో భక్తులు

నాయుడుపేటటౌన్‌: పట్టణంలోని గరిడీవీధిలోని హజరత్‌ మౌలాలి తాలీంఖానాలో మొహరం పండుగ సందర్భంగా సోమవారం రాత్రి పీర్ల పండుగ ఘనంగా జరిపారు. ముందుగా మౌలాలి తాలీంఖానా యువజన కమిటీ సభ్యులు, పెద్దలు గరిడీలోని చావిడిలో పాతేహా జరిపారు. అనంతరం మౌలాలి పంజా (పీర్లు)ను గుర్రంపై పురవీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో భక్తుల పులివేషాలు ఆకట్టుకున్నాయి. స్థానిక కౌన్సిలర్‌ షేక్‌ షబ్బీర్‌ అన్నదానం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

నాయుడుపేట టౌన్‌: మేనకూరు జెడ్పీ పాఠశాల విద్యార్థులకు దాతలు సోమవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. మండలంలోని మేనకూరులో ఎన్‌ఆర్‌ఐ ఎం ఇందిర, సునీల్‌రెడ్డిల సారథ్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ అధికార ప్రతినిధి కే సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కే జ్యోతిరెడ్డి దంపతుల మనవరాలు ఇందిర అమెరికాలో మెడిసెన్‌ చదువుతోంది. ఈ క్రమంలో స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా ఆమె తన వంతుగా సాయంగా స్థానిక జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు విద్యాసామగ్రి, హెల్త్‌క్లినిక్‌కు బీరువా, వైద్య పరికరాలను అందజేశారు ఏపీఐఐసీ ఐలా కమిషనర్‌ తిరుపాల్‌, హెచ్‌ఎం మల్లికార్జున పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సురక్ష

సైదాపురం: సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిద్దలూరులో మంగళవారం జగనన్న సురక్ష పథకం నిర్వహించనున్నట్లు చెప్పారు. దరఖాస్తులను పరిశీలించి, అర్హులందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులున్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి


కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రజనీకాంత్‌

ఓజిలి: ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రజనీకాంత్‌ అన్నారు. మండలంలోని రాచపాళెంలో ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క కూలీ రెండు అడుగుల లోతు, వెడల్పు పనిచేస్తే తప్పకుండా రూ.272 నగదు గిట్టుబాటు అవుతుందన్నారు. కూలీల మస్టర్‌లను పరిశీలించి సూచనలు చేశారు. ఈయన వెంట ఏపీఓ ఉషారాణి, టీఏ మహేష్‌కుమార్‌ తదితరులు ఉన్నారు.

మోటార్‌ బైక్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురికి గాయాలు


గాయపడిన మోహన్‌, రేఖ, ప్రవీణ్‌కుమార్‌

నాయుడుపేటటౌన్‌: మండలంలోని విన్నమాల సమీపంలో జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం ఉదయం మోటార్‌ బైక్‌ను కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. విన్నమాల గ్రామానికి చెందిన మోహన్‌ పట్టణంలో బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయంలో కాంట్రాక్ట్‌ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతని కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు నాయుడుపేటలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలలో సీటు రావడడంతో చేర్చేందుకు భార్య రేఖతో కలసి సోమవారం ముగ్గురు బైక్‌లో బయలుదేరారు. విన్నమాల సమీపంలో జాతీయ రహదారి కూడలిలో రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు నుంచి నెల్లూరుకు కారు ముందు వెళుతున్న లారీను అధిగమించబోయి మోటార్‌ బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌తోపాటు ముగ్గురు రోడ్డు పక్కన పొలాల్లో పడిపోయారు. ఈ ప్రమాదంలో బైక్‌ నడుపుతున్న మోహన్‌తో పాటు అతని భార్య రేఖ, కుమారుడు ప్రవీణ్‌ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి, తిరుపతికి తరలించారు. ఈ సంఘటనపై సీఐ నరసింహరావు ప్రభుత్వ వైద్యశాల వద్దకు చేరుకుని ప్రమాద వివరాలపై ఆరా తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


బైక్‌ను ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

తడ: జాతీయ రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. తడ కండ్రిగ బీసీ కాలనీకి చెందిన మునియప్పన్‌ భార్యతో కలిసి రోడ్డు పక్కగా వెళుతున్న సమయంలో చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మునియప్పన్‌ గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం చెన్నైకి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకోండి

వెంకటగిరి: పట్టణంలోని కుమ్మరిగుంట అయ్యప్పస్వామి ఆలయాన్ని ప్రభుత్వం దేవాదాయశాఖ ఆధీనంలోకి తీసుకోవాలని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సీ వెంకటరాయులు కోరారు. ఆలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయ హుండీ, వచ్చిన విరాళాలు వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయని ప్రశ్నించగా ఆలయ కమిటీ సభ్యుల్లో కొందరు తనను గౌరవ అధ్యక్షుడు కాదని తీర్మానాలు చేశారని ఆరోపించారు. ఎండోమెంట్‌ ఆధ్వర్యంలో అన్ని అనుమతులతో నిబంధనల మేరకు నిర్వహించాల్సిన ఆలయ నిర్వాహణ ఇప్పుడు ఉన్న కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా చేస్తున్న విషయాలను దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోటీశ్వరరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: సచివాలయాల్లోని డిజిటల్‌ అసిస్టెంట్లు, హౌసింగ్‌ సిబ్బంది పరస్పర సహకారంతో జగనన్న లేఅవుట్లలో పక్కా గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయించాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్‌ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 13 సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లను ఉపాధిహామీ కింద జంగిల్‌ క్లియరెన్స్‌ పనులు చేపట్టి వెంటనే లబ్ధిదారులకు స్థలం కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌ రామయ్య, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.